క్లుప్తంగా

డ్రోన్‌తో క్రిమిసంహారక మందు పిచికారీ



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో పంటల సాగులో భాగంగా రైతులు డ్రోన్‌తో క్రిమిసంహారక మంద్రు స్ప్రే చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న అభివృద్ధి నేపథ్యంలో రైతులు డ్రోన్‌ను తెప్పించి ప్రయోగం చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో పవన్, కార్తీక్, దొంతరబోయిన అంజయ్య, ముద్రబోయిన ఉప్పలయ్య, గుండె కార్తీక్, నందనబోయిన యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు



ఖానాపురం: మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది. నమోదు ప్రక్రియను తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీఓ సుమణవాణి మంగళవారం పర్యవేక్షించారు.

బోరు పనులు ప్రారంభం



పర్వతగిరి: మండలంలోని గోరుగుట్టతండాలో బోరు పనులను సర్పంచ్ బానోతు వెంకన్న మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిధులు మంజూరు కావడంతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ నర్సింహ, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరంలోని 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన లేదల్ల వినోద వర్ధంతి సందర్భంగా ఆమె భర్త దేవదాస్ వాలీబాల్, నెట్, ఇతర సామగ్రి మంగళవారం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పోలెపాక సుమన్, కృష్ణారెడ్డి, హెచ్‌ఎం జ్యోతిర్మయి, పీఈటీ రఘువీర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



సంగెం: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన మేడిది రవీందర్ ఇటీవల, ఆయన భార్య అనిత గతంలో మృతి చెందగా అనాథగా మారిన వారి కొడుకు మణికంఠకు మున్నూరు కాపు పరపతి సంఘం గ్రామ అధ్యక్షుడు గన్ను సంపత్ మంగళవారం రూ.5 వేల సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మెంతుల అనిల్, మాదినేని రామయ్య, చంద్రయ్య, వాసం వెంకయ్య, మేడిది సదానందం, పోశాల రాజేశ్, మేడిది సంపత్, వెంకటేశ్వర్లు, రాజేందర్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

నెక్కొండ: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన సుంకరి వీణమాధురి (34) క్రిమిసంహారక (గడ్డి మందు) మందు తాగి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్టు ఎస్సై షేక్ జానీపాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బీసీ కాలనీకి చెందిన సుంకరి నరేశ్‌కుమార్, మూడు వీణమాధురి 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండేళ్లుగా వీణమాధురిని భర్త నరేశ్ అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 30న వీణమాధురి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. కాగా వీణమాధురి పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి సోదరుడు మూడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

‘దళితబంధు’ విడుదల చేయాలి



నర్సంపేట రూరల్ : వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు



నల్లబెల్లిలో..



ఖానాపురంలో..

నర్సంపేట రూరల్ : దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ రాజుకు పలువురు లబ్ధిదారులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కొంకటి రవీందర్, మామిడాల మధు, మాతంగి నరేశ్ మాట్లాడారు. తమకు దళితబంధు మంజూరైనట్లు ప్రొసిడింగ్ కాపీలు అందించారని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో సాయం నిలిచిపోయిందని, కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన క్రమంలో వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు మల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి: గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన లబ్ధిదారులకు దళితబంధు నిధులు విడుదల చేయాలని స్థానిక ఎంపీటీసీ జన్ను జయరావు కోరారు. ఈ మేరకు దళితబంధు లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ జయరావు మాట్లాడారు. నియోజకవర్గంలో 1100 మంది లబ్ధిదారులు ఎంపికైన ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన క్రమంలో లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు బొట్ల పవన్, బట్టు సాంబయ్య, అద్ద రాజు, బొమ్మకంటి అనిల్, నల్తి శ్యామ్, పరికి నవీన్, బొట్ల శ్రీనివాస్, పరికి రత్నం, మిడిదొడ్డి చంద్రు, సారయ్య, దూడల సుమన్, మహేశ్, ప్రకాశ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం: గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన లబ్ధిదారులకు దళితబంధు నిధులు విడుదల చేయాలని సర్పంచ్ గొర్రె కవిత, బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ దాసరి రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ సుమణవాణిలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం కవిత, రమేశ్ మాట్లాడారు. గేదెల పైలెట్ ప్రాజెక్ట్, దళితబంధు కోసం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి మంజూరు చేసే సమయంలోనే ఎన్నికలు వచ్చి నిధుల విడుదల నిలిచిపోయిందని చెప్పారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో లబ్ధిదారులు నాగరాజు, సురేశ్, కొంరమ్మ, వెంకన్న, దావీద్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: తమకు దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేసారు. వినతిపత్రం అందజేసిన వారిలో లబ్ధిదారులు సురేశ్, నర్సింగరావు, జనార్దన్, కుమారస్వామి, సారంగం, యాకూబ్, సారయ్య, రమేశ్, బాలజోజి, తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట: పట్టణంలోని సర్వే నంబర్‌లోని 121 ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజాసంఘాల జేఏసీ, మహజన సోషలిస్టు పార్టీ నాయకులు ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, కల్లెపల్లి ప్రణయ్‌దీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆర్డీఓ కృష్ణవేణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు, ప్రణయ్‌దీప్ మాట్లాడారు. సదరు ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకోగా 2011లో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో హద్దులను నిర్ధారించారని చెప్పారు. కాగా గతేడాది డిసెంబర్ 21న రాత్రి రియల్టర్లు ట్రాక్టర్లతో భూమిలో అక్రమంగా మట్టి రవాణా చేశారని తెలిపారు. ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తడుగుల విజయ్, బొట్ల నరేశ్, చింతం సిద్దూ, కొడారి రవి, కుమార్, శ్రీకాంత్, నిఖిల్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ఖానాపురం: రైతులకు అందుబాటులో మండల కేంద్రంలోని సొసైటీలో ఎరువులు ఉన్నాయని వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడారు. స్థానిక సొసైటీ పరిధిలో సింగిల్ సూపర్ పాస్ఫేట్ ఎరువుల బస్తాలున్నాయని చెప్పారు. వరి, మక్కజొన్న పంటలకు అడుగు మందుగా ఎకరాకు బస్తా డీఏపీకి బదులుగా రెండున్నర బస్తాల సింగల్ సూపర్ పాస్ఫేట్ వాడితే భూములు దిగబడకుండా ఉంటాయని తెలిపారు. వరి నాటు వేయడానికి 15 రోజుల ముందు సింగల్ సూపర్ పాస్ఫేట్ ఎరువును ఎకరా దుక్కిలో 125 వేసుకోని దున్నితే పంట అవశేషాలు బాగా చివికిపోయి వరికి పోషకాలు అందుతాయని వివరించారు. రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13 నుంచి క్రీడోత్సవాలు

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామంలో ఈనెల 13 నుంచి 15 వరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నర్సంపేట నియోజకవర్గస్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు బాధ్యుడు భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ క్రీడల్లో పోటీలుంటాయని పేర్కొన్నారు. విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేల చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు రూ.400, రూ.300, రూ.200 చొప్పున ఎంట్రీ ఫీజు చెల్లించి సకాలంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నర్సంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట: పేద కుటుంబాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు మంగళవారం ఆయన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఇకనుంచి పేద కుటుంబాల్లోని యువతుల వివాహానికి రూ.లక్ష 116లు నగదుతోపాటు తులం బంగారు అందిస్తామని చెప్పారు. పేదలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 85 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాధవరెడ్డి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్, అమీన్‌పేట సర్పంచ్ గరికపాటి హన్మంతరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

● ముగ్గురిపై కేసు.. ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గుడుంబాతో సిబ్బంది

నెక్కొండ: మండలంలోని చర్లతండా, రాంపూర్‌తండా, కుసుసోతు తండా, సూరిపెల్లి, నెక్కొండ గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ ఆధ్వర్యంలో స్టేట్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్టు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 1200 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశామని సీఐ చెప్పారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. మండల కేంద్రంలోని పలు కిరాణం దుకాణాల్లోనూ అధికారులు తనిఖీ చేశారు. హైస్కూల్ సెంటర్‌లోని ఓ కిరాణ షాపులో క్వింటా చక్కెరను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వెల్లడించారు. చక్కెరను పరిమితికి మించి ఉంచడం తోపాటు గుడుంబా తయారీకి విక్రయిస్తున్న క్రమంలో షాపు యజమానిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని వివరించారు. గుడుంబా తయారీ, క్రయవిక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎస్‌టీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, డీటీఎఫ్ సీఐ రమేశ్ చందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



నల్లబెల్లి: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



దుగ్గొండి: గుడ్డేలుగులపల్లిలో..

నల్లబెల్లి: మండలంలోని కొండాయిల్‌పల్లి, ముచ్చింపుల, శనిగరం, బిల్‌నాయక్ తండా, రాంతీర్థం, గొల్లపల్లి గ్రామాల్లో హనుమాన్ భక్తులు శ్రీరాముడి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. తొలుత సీతారామాంజనేయ స్వామి ఆలయం నుంచి అక్షింతలు తీసుకురాగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సంచాలన సమితి మండల బాధ్యుడు మార్త మార్కండేయ మాట్లాడారు. అయోధ్య శ్రీరాముడి అక్షింతలు ఇంటింటికీ చేరేలా భక్తులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్చకులు కొండ కృష్ణస్వామి, శ్రీనివాస శర్మ, ట్రస్టు మండల కమిటీ సభ్యులు తడుక వినయ్, ప్రమోద్, నరహరి, రాంబాబు, గురుస్వాములు గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

దుగ్గొండి: మండలంలోని గుడ్డేలుగులపల్లిలో అయోధ్య రాముడి అక్షింతలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్లె రమ, ఉపసర్పంచ్ జంగిలి రవి, తొర్రూరు రామన్న, చాపర్తి నర్సయ్య, వేల్పుల సిద్దు, గణేశ్, రవి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

నర్సంపేట: నర్సంపేట డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీల బకాయిలు విడుదల చేయడంతోపాటు గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, డీవైఎఫ్ఐ నాయకుడు గడ్డమీది బాలకృష్ణ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతరం ఎమ్మెల్యేకు సమస్యలు వివరించారు. విద్యార్థుల పట్ల స్పందించాలని కోరారు.

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నర్సంపేట రూరల్ : పట్టణంలోని అక్షర స్కూల్ వార్షికోత్సవ వేడుకలను మండలంలోని బిట్స్ కళాశాల ఆవరణలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరరీ డాక్టర్ ఏ.వనజ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు చదువుకోవడంతోపాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించే దిశగానే కాకుండా అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, పావని, దృశ్యంత్‌రెడ్డి, కీర్తన, హెచ్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శగ్రామంలో విద్యార్థుల అధ్యయనం

గీసుకొండ: జాతీయ ఆదర్శగ్రామంగా ఎంపికైన మండలంలోని గంగదేవిపల్లిని వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎల్లంబజార్‌కు చెందిన రిషి హైస్కూల్ 6వ తరగతి విద్యార్థులు మంగళవారం సందర్శించి అధ్యయనం చేశారు. సాంఘిక శాస్త్రంలో గ్రామం సాధించిన విజయాల గురించిన పాఠం ఉండటంతో ప్రత్యక్ష అవగాహన కోసం స్కూల్ యాజమాన్యం విద్యార్థులను తీసుకొచ్చింది. విద్యార్థులకు గ్రామ అభివృద్ధి తీరుతెన్నులను సర్పంచ్ గోనె మల్లారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచార్య ప్రసన్న, సుధాకర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో సర్పంచ్ మల్లారెడ్డి

కాంగ్రెస్ నాయకుల నివాళి



నర్సంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



చెన్నారావుపేటలో..

నర్సంపేట: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన మేడపల్లి ఉప్పలయ్య, 20వ వార్డుకు చెందిన పడాల మధుసూదన్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతదేహాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, నాయకులు ములుకల సాంబయ్య, మెరుగు సాంబయ్య, లక్కాసు రమేశ్, పేరం బాబురావు, పంబి వంశీకృష్ణ, ములకల మనీశ్, శ్రీరామోజు మురళి, ముత్తినేని వెంకన్న, ఓర్సు సాంబయ్య, మోటం రవికుమార్, నాడెం నగేశ్, గిరగాని రమేశ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

పాత ముగ్దుంపురంలో..

చెన్నారావుపేట: మండలంలోని పాతముగ్దుంపురం గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ ములుక తిరుపతి (48) గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నలమాస వీరస్వామి, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్, భిక్షపతి, లక్ష్మణచారి, భార్గవ్, రంజిత్, రాజేందర్, శ్రీను, శివ పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నల్లబెల్లి: డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ



పర్వతగిరి : ఏనుగల్ జెడ్పీ హైస్కూల్‌లో..



ఖానాపురం: బుధరావుపేట హైస్కూల్‌లో..



రాయపర్తిలో..

నల్లబెల్లి: యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 డైరీ, క్యాలెండర్‌లను ఎంఈఓ చదువుల సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ మోత్కూరి శ్రీనివాసరావు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు రాయబోస్, కోశాధికారి నాంపల్లి రాజయ్య, బాధ్యులు కత్తి కుమారస్వామి, బుచ్చన్న, మోహన్‌లాల్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను మండల నోడల్ అధికారి జి.లింగారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత అనుభవాలను సమీక్షించుకుని సరైన దిశలో పయనించడానికి డైరీ ఉపకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్, మండల అధ్యక్షుడు పాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుండు కరుణాకర్, స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హైమావతి, యూటీఎఫ్ బాధ్యులు ప్రసాద్, శివప్రసాద్, సంపత్, మనోహర్, నరేందర్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్..

మండలంలోని ఏనుగల్ జెడ్పీ హైస్కూల్‌లో డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను మండల నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహంకాళి రామస్వామి, మండల అధ్యక్షుడు మిట్టపల్లి నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి కందగట్ల రమేశ్, నాయకులు ఎల్ల రాజు, కిషన్, శ్రీధర్, కుమారస్వామి, సంపత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుధరావుపేట హైస్కూల్ ఆవరణలో..

ఖానాపురం: మండలంలోని బుధరావుపేట హైస్కూల్ ఆవరణలో డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆరీఫ్ హుస్సేన్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కొర్ర రమేశ్, మాలోతు జగన్, శ్రీనివాస్, డానియల్ పాల్, శ్రీనివాస్, వెంకట్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, పాషా, రవి, సర్వన్, శ్రీధర్, వినోద, లక్ష్మి, రజిత, దేవి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గుముడవెల్లి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు బందుగు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ముదురుకోళ్ల సతీశ్‌కుమార్, బాధ్యులు మచ్చ శ్రీనివాస్, సౌమిత్రి, కరుణ, సుధీర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

కొత్తగూడ: ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సర్పంచ్ మల్లెల రణధీర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిజిటల్ డెమో సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ భద్రయ్య, బీజేపీ నాయకులు నవీన్‌నాయక్, మునేందర్, మధు పాల్గొన్నారు.

18న సదరం క్యాంపు

వర్ధన్నపేట: జిల్లాలోని అన్ని మండలాలు, మూడు మున్సిపాలిటీలకు చెందిన దివ్యాంగులకు ఈనెల 18న మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు ఏర్పాటు చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థో, మానసిక వైకల్యాల విభాగాలకు సంబంధించిన వారికి మాత్రమే పరీక్ష చేస్తారని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు, రెన్యూవల్ చేసుకునే వారికి షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తారని తెలిపారు. దివ్యాంగులు మీ సేవా కేంద్రాల్లో నేడు (బుధవారం) మధ్యాహ్నం 3 గంటల నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొ న్నారు. స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులు నిర్దేశించిన తేదీల్లో వైకల్య ధ్రువీకరణ పత్రం, వైద్యుడి నివేదిక, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సదరం క్యాంపునకు హాజరు కావాలని తెలిపారు.

ఫాతిమా షేక్ జయంతి వేడుకలు



గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో హెచ్‌ఎం సుజాత అధ్యక్షతన ఫాతిమా షేక్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య మాట్లాడారు. అణగారిన కులాల మహిళల విద్యాభివృద్ధికి జ్యోతిబాపూలే దంపతులతో కలిసి మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ పాటుపడ్డారని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీ శోభన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కోడెం రజిత, మోకాళ్ల వెంకన్న, మండల వెంకన్న, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.